**Eenadu**

# సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి సానుకూలం

- **రిజిస్ట్రేషన్ శాఖలో తీరనున్న సమస్యలు**

**ఈనాడు, అమరావతి:** ఇరవయ్యేళ్ల నుంచి స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో ఉన్న సమస్యకు తెరపడబోతోంది. రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ సానుకూలంగా స్పందించింది. ఇందుకు సంబంధించిన దస్త్రం ముఖ్యమంత్రి ఆమోదం కోసం వెళ్లింది. 294 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉంటే అందులో 221 చోట్ల సీనియర్ అసిస్టెంట్లు లేరు. గత రెండు దశాబ్దాలుగా ఖాళీ సంఖ్య పెరుగుతూ వస్తోందే తప్ప ఆ పోస్టులను భర్తీ చేయడం లేదు. ఒక్కో కార్యాలయంలో ఇద్దరు ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు ఉన్నా సీనియర్ అసిస్టెంట్ లేకపోవడంతో పలు పాలనాపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సబ్ రిజిస్ట్రార్ సెలవులో ఉన్నా, ఉన్నతాధికారులతో సమావేశాలకు వెళ్లినా సీనియర్ అసిస్టెంట్‌కి తాత్కాలిక బాధ్యతలు ఇవ్వాలని నిబంధనలు చెబుతున్నాయి. అయితే ఆ పోస్టులో ఎవరూ లేకపోవడంతో ఇతర ప్రాంతాల్లోని ఆ స్థాయి ఉద్యోగిని పిలిపించుకొని అప్పగించాల్సి వస్తోంది. ఫలితంగా రిజిస్ట్రేషన్ లావాదేవీలు కూడా కొన్ని సందర్భాల్లో నిలిచిపోతున్నాయి. కొద్ది నెలలుగా ఈ అంశంపై అధికారులు ప్రభుత్వానికి సవివరమైన నివేదిక ఇచ్చారు. జూనియర్ అసిస్టెంట్ పోస్టుని అప్‌గ్రేడ్ చేయడం ద్వారా ఏటా పడే ఆర్థిక భారం రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల మధ్యనే ఉంటుందని తెలిపారు. ఇందుకు ఆర్థిక శాఖ అంగీకారం తెలిపింది. 221 సీనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి సంబంధించిన దస్త్రాన్ని ముఖ్యమంత్రికి పంపించారు. త్వరలోనే సానుకూల నిర్ణయం వెలువడుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.